## క్లుప్తంగా

### రేపు కంటి వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 20న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమన్‌గల్ పీఆర్‌ఓ పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు చేయించుకునేవారు ఆధార్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

### మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే అభిమాని

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధిస్తే శ్రీశైలం మల్లన్నను దర్శించుకుంటానని మండలంలోని ఎల్లికల్ మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్ మొక్కుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీశైలం మల్లన్నను దర్శించుకొని భక్తులకు అన్నదానం చేసి ఎమ్మెల్యేపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

### మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ అప్రజాస్వామికం

లింగాల: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతుల అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కేటీ తిర్పతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు అచ్చంపేటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యేను అక్రమంగా అడ్డుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు.

### అక్రమంగా బోర్లు డ్రిల్లింగ్ చేయొద్దు

పెద్దకొత్తపల్లి: అక్రమంగా బోర్లు డ్రిల్లింగ్ చేయొద్దని పారా లీగల్ వలంటీర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దకార్పాముల రైతువేదికలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో వాల్టా చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 తరువాత బోరు వేసిన తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలన్నారు. కొత్తగా బోర్లు డ్రిల్లింగ్ రైతులు తహసీల్దార్‌తో పాటు భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో రైతులు యాదగిరి, కృష్ణయ్య, దస్తగిరి, కృష్ణయ్య, భాను, రామస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### శిథిలావస్థలో బస్‌షెల్టర్



తాడూరు: మండలంలోని జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ మల్కాపూర్ గేటు వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. సరైన నిర్వహణ లేకపోవడంతో చుట్టు పిచ్చిగడ్డి పెరిగింది. విషపురుగులు ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి తాత్కాలిక మరమ్మతు నిర్వహించి బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### సుబ్రమణ్యస్వామి షష్టి మహోత్సవం

దోమలపెంట: సుబ్రమణ్యస్వామి స్కంద షష్టి మహోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక శివాలయంలో అర్చకులు రామాంజనేయ శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. అమ్రాబాద్ జెడ్పీటీసీ అనురాధ, ఆలయ ధర్మకర్త మహానంది, శివస్వామి, జంగయ్య పాల్గొన్నారు.

### న్యూమోనియా లక్షణాలపై ఇంటింటి సర్వే



పాన్‌గల్: ఐదేళ్ల లోపు చిన్నారులకు న్యూమోనియా లక్షణాల గుర్తింపుపై వైద్య సిబ్బంది సోమవారం మండలంలోని చింతకుంట, మల్లాయిపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉన్న చిన్నారులను చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. దీంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చనన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్తేరమ్మ, బుచ్చమ్మ, శ్యామల, సునీత తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- మందుబాబులకు అడ్డాగా మైదానాలు
- వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు




మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న క్రీడామైదానం



యాదిరెడ్డిపల్లిలో క్రీడా ప్రాంగణంలో మద్యం సీసాలు

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడల్లో ప్రోత్సాహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసానికి తోడ్పడే విధంగా గ్రామీణ ఆట స్థలాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించి ఉపాధి హామీ నిధులతో ఆ స్థలాల్లో క్రీడాప్రాంగణాలను నిర్మించారు. ఇప్పటికే దాదాపు అన్ని గ్రామాల్లో ప్రాంగణాలు పూర్తయ్యాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడాప్రాంగణాలు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని పలువురు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారిస్తుందా లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 20 గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో సగానికి పైగా వినియోగంలో లేవు. గ్రామాలకు దూరంగా స్థలం ఎక్కడ ఉంటే అక్కడ బోర్డులు పెట్టారు. ఆడేందుకు ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

**క్రీడాకారులను ప్రోత్సహించేందుకు..**

క్రీడా ప్రాంగణాలను ఎకరం స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ గ్రామాల్లో స్థలం కొరతతో ప్రతిపాదనలను కుదించారు. 10 కుంటల నుంచి స్థలాలను అధికారులు గుర్తించి నిర్మాణాలు చేపట్టారు. అందులో తోరణం, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పిల్లల్ల కోసం రూ.55 వేలు వెచ్చించారు. స్థలాన్ని చదును చేసేందుకు స్థలాన్ని బట్టి మరిన్ని నిధులు మంజూరు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా ఆ దిశలో చర్యలు చేపట్టలేదు. కొన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణం గ్రామానికి దూరంగా నిర్మించడంతో గ్రామస్తులు వినియోగించడం లేదు. కొందరు రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు క్రీడా మైదానాలను వాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాలలోని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

**వినియోగంలోకి తేవాలి**



ప్రభుత్వం మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలలో సరైన ఏర్పాట్లు లేవు. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు కనుమరుగు కాకుండా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు కంచె వేసి కాపాడాలి. – జి శేఖర్, తాడూరు

**కిట్లు పంపిణీ చేశాం**



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. స్థలాల కొరత కారణంగా కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయిన క్రీడా మైదానాలు నిర్మించాం. క్రీడలకు సంబంధించిన కిట్లను కూడా ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు అందజేశాం. క్రీడాకారులకు మైదానాలపై అవగాహన కల్పిస్తాం. – గంగమోహన్, ఎంపీడీఓ, తాడూరు

## ప్రజలకు అందుబాటులో ఉంటా



కాలనీ వాసులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డులో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. కాలనీ వాసులకు ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. అన్నదాన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కౌన్సిలర్లు సుమేంద్ర, కావలి శ్రీనివాసులు, నాయకులు నిజాముద్దీన్, పిడికిళ్ల శ్రీనివాసులు, గడ్డి శేఖర్, కుంభం మల్లేష్‌గౌడ్, రఘు, దయాకర్ రెడ్డి, కోట్ల శ్రీనివాసులు, ఇస్మాయిల్, కురుమూర్తి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆధ్యాత్మిక చింతనలో ప్రశాంతత**

తాడూరు: ఆధ్యాత్మిక చింతనలో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొమ్ము గుట్ట ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాస్థానంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియమనిష్టలకు ప్రతిరూపం అయ్యప్పమాలధారులని పేర్కొన్నారు. జెడ్పీటీసీ రోహిణి, సర్పంచ్ యాదమ్మ, ఎంపీటీసీ రేణుక, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు అరికడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్: బాల్య వివాహాలను అరికడదామని గాంధీ హైస్కూల్ హెచ్‌ఎం శోభారాణి కోరారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యవివాహాల రహిత దేశం కావాలని కాంక్షిస్తూ విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కోనేరు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు ఉన్నారు.

## తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి



తడి, పొడి చెత్తను వేరుచేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

కల్వకుర్తి టౌన్: పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా మున్సిపాలిటీ సిబ్బందికి అందించాలని కమిషనర్ ఆశ్రిత్ కుమార్ కోరారు. సోమవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్తలను వేరుచేసే ప్రక్రియను ఆయన ప్రారంభించి పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ చెత్తను వేరుచేసిన తర్వాత తడి చెత్తతో ఆధునిక యంత్రీకరణ సహాయంతో ఎరువులను తయారుచేస్తారని వివరించారు. మంగళవారం, శుక్రవారాలలో పొడి చెత్తను, మిగిలిన రోజులలో తడి చెత్తను మున్సిపాలిటీ సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు.

### నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చారకొండ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని తుర్కలపల్లి, శాంతిగూడెం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాల్లో నర్సరీల్లో ఉన్న మొక్కలను పరిశీలించి, వాటి పెరుగుదల తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు సూచించారు. నర్సరీలపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అనంతరం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న జీపీ భవన నిర్మాణాలను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఆమె వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు



కల్వకుర్తి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయానికి శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామ అక్షింతలను సోమవారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. జనవరి 15 వరకు ప్రతి ఇంటింటికి రామమందిర చిత్రపటం, అక్షింతలు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వీహెచ్‌పీ నాయకుడు గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు.

పెంట్లవెల్లి: అయోధ్య రాముడి అక్షింతలు మండల కేంద్రానికి చేరాయి. జనవరి 22న గర్భాలయంలో బాలరాముడి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించి శ్రీరామ అక్షింతలు తలపై చల్లుకుని స్వామివారి ఆశీర్వాదం పొందాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుల కోరారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి అయోధ్య శ్రీరామ ఆలయ దివ్య అక్షింతలు శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చేరనున్నాయి. అక్షింతలను ప్రతి గడపకు చేర్చుతామని వీహెచ్‌పీ నాయకుడు రఘుపతిరెడ్డి, శ్యాంసుందర్, తెలిపారు.

### ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మహిళలు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి పున:నిర్మించిన శివాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు గణపతి, నందీశ్వర, పార్వతీ, శివలింగం, నాగదేవత, కుమారస్వామి, వీరభద్ర విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ, శిఖర కలశంలను ప్రతిష్ఠించారు. ముఖ్య అతిథిగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. సర్పంచ్ రవిశంకర్, వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు ఆర్థికసాయం



చెక్కుల పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

దోమలపెంట: గ్రామంలో ఇటీవల కాలంలో జన్మించిన ఎనిమిది మంది చిన్నారులకు ఎంపీటీసీ మల్లికార్జున సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మా ఊరు మహాలక్ష్మి పేరుతో ఒక్కొక్కరికి రూ.3,116ల చొప్పున జెడ్పీటీసీ అనురాధతో కలిసి ఆయన చిన్నారుల తల్లిదండ్రులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మల్లికార్జున దంపతుల సేవలను జెడ్పీటీసీ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మోయిజ్, గురువయ్య, పార్థసారథి, కటకం వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

అచ్చంపేట రూరల్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఆశావర్కర్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశావర్కర్లు సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, సైదమ్మ, భాగ్యలక్ష్మి, నిర్మల, శివలీల, కల్పన, సుజాత, అలివేల పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ యాదగిరి, విజ్జయ్య, లింగస్వామి, రాములు, కుర్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

కల్వకుర్తిరూరల్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టీఓ విజయ్‌కుమార్ అన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో సోమవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఓ, ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో పాటు పీఆర్‌సీని పెన్షనర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. 70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుధాకర్, జగన్‌మోహనాచారి, యాదగిరి ఆచారి, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు ఉపాధి చూపించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలను చూపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద రవాణా రంగం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో రవాణా రంగం కార్మికులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై 50 లక్షల మందికి పైగా కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో కార్మికులు వీధిన పడ్డారన్నారు. కార్మికులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఫైనాన్స్ కిస్తులు ఎలా కడుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2019 మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం హామీ మేరకు ఆటో డ్రైవర్లకు రూ.12వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, కార్యదర్శి పొదిల రామయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, హోమం, తదితర పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు జంగం శివరాజు, గీత, నాగరాజు, శరత్, బాలచంద్రమ్మపాల్గొన్నారు.

## కరాటే పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులు

లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఓ శారద సోమవారం తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని జడ్చర్లలో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బాలికలు పాల్గొని ప్రతిభ కనబర్చారు. 9వ తరగతికి చెందిన కె.సునీత, ఎస్.చిన్నారి, సి.నందిని మొదటి స్థానం, ఎం.వాసంతి ద్వితీయ స్థానంలో నిలిచారు. పీఈటీ పద్మ, మాస్టర్ ముఖేష్ విద్యార్థినిలను అభినందించారు.

### టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్: నాగరికతకు అనుగుణంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు స్కాన్ లెర్నింగ్ పాఠ్య పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టెక్నాలజీని అందివాలనే ఉద్దేశంతో స్కాన్ లెర్నింగ్ పాఠ్య పుస్తకాలను ఫౌండేషన్ తరపున అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీను, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు, నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**చదువుతోనే పేదరిక నిర్మూలన**

వెల్దండ: చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ విద్యార్థులకు స్కాన్ అండ్ లెర్నింగ్ డిజిటల్ కంటెంట్ పాఠ్య పుస్తకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవిధంగా ఫౌండేషన్ సహకారం అందిస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ పుష్పలత తదితరులు ఉన్నారు.

### సీఎంను కలిసిన ఆశాదీప్‌రెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సూదిని రాంరెడ్డి, తాండ్ర సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ఒకటో వార్డుకు చెందిన వృద్ధులకు సోమవారం సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలంలో వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉచితంగా దుప్పట్లను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

### భూ పరిహారం ఇవ్వాలి

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో కేఎల్‌ఐ డీ–8 కాల్వల తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం మంజూరులో జాప్యం నివారించి, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతూ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

### ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన శివలీల సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు నక్క వేణుగోపాల్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కుంగిన సీసీ రోడ్డు



తెలకపల్లి నుంచి లింగాలకు వెళ్లే సీసీ రోడ్డు

తెలకపల్లి: మండల కేంద్రంలోని లింగాల రోడ్డులో కట్టు కాలువ దగ్గర సీసీ రోడ్డు కుంగి ప్రమాదభరితంగా మారింది. దీంతో ఒకవైపు కిందికి కుంగి, మరోవైపు ఎత్తుగా రోడ్డు ఉండటంతో మధ్య భాగంలో వెళ్తున్న ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. కుంగిన రోడ్డు కనిపించకపోవడంతో వాహనదారులు కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. ఇటీవల గౌరారం గ్రామానికి చెందిన రాములు ఇదే రోడ్డు మార్గం గుండా ప్రయాణిస్తూ బైక్‌పై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. ఇలా తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సీసీ రోడ్డుకు మరమ్మతు చేసి ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.